


## సేంద్రియ వ్యవసాయ విధానాలు పాటించాలి

**రైతు సంఘం మండలాధ్యక్షుడు పెంటయ్య**


రైతులను సన్మానిస్తున్న పెంటయ్య

చందుర్తి, ఫిబ్రవరి 24 : సేంద్రియ వ్యవసాయ విధానాల ద్వారా పండించిన పంటతో భూమితో పాటు మనుషుల ఆరోగ్యం మెరుగుపడుతుందని మండల రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలుక పెంటయ్య సూచించారు. సోమవారం మండల రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రైతులకు సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం సేంద్రియ వ్యవసాయ విధానాలతో రైతులకు కలిగే లాభాలను వివరించారు. అవగాహన సదస్సుకు ప్రోత్సాహాన్ని అందించిన రైతులు వరికిల బాబురావు, చంటి బాపురావు, పోజరాజు తిరుపతి, రవీందర్ రెడ్డి,ఏరెడ్డి రాజిరెడ్డి, దుదిల్లా లచ్చిరెడ్డిని ఆయన శాలువాతో ఘనంగా సన్మానించారు. మండల రైతు సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు కొమ్ము శంకర్,రమేశ్‌రావు, రామస్వామి, మోహిని, మహేశ్, రాములు, తిరుపతి, బాపురెడ్డి తదితరులు ఉన్నారు.

## కలెక్టరేట్‌లో పోస్టల్ బ్యాలెట్ కేంద్రం ఫెసిలిటేషన్ సెంటర్

**ఉద్యోగ సిబ్బంది ఓటు హక్కు వినియోగించుకోవాలి**

కలెక్టరేట్, ఫిబ్రవరి 24: జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు సోమవారం క్వార్టర్ నంబర్‌వన్‌లో పోస్టల్ బ్యాలెట్ కేంద్రం ఫెసిలిటేషన్ సెంటర్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. కాగా, వేములవాడ రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్ రాజేశ్వర్ హాజరై మొదటి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొంటున్న ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగ సిబ్బంది తమ ఓటు హక్కును మంగళవారం క్వార్టర్ నంబర్ 1 ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీస్ కాంప్లెక్స్‌లో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

గంభీరావుపేట, ఫిబ్రవరి 24 : మండలంలోని పదో తరగతి విద్యార్థులకు సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. మండల కేంద్రంలోని నిర్వహించిన టాలెంట్ టెస్టులో మండల స్థాయి విద్యార్థులు హాజరయ్యారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కల్యాణ్‌కుమార్ తెలిపారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థుల్లో భ యాన్ని పోగొట్టడానికి గాను తమ వంతుగా మండలాల వారీగా టా లెంట్ టెస్టులు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుతూ ఉన్నత ఫలితాలు సాధించాలని వారు విద్యార్థులకు సూచించారు.

## పుణ్యక్షేత్రాలకు వెళ్లి.. విగతాజీవిగా వచ్చి..

- అస్వస్థతకు గురైన యువకుడు
- దవాఖానలో చికిత్స పొందుతూ మృతి
- కొత్తదాంరాజ్‌పల్లి గ్రామంలో విషాదం


చంద్రశేఖర్‌రెడ్డి(ఫైల్)

మల్లాపూర్, ఫిబ్రవరి 24: తోటి మిత్రులతో కలిసి పుణ్యక్షేత్రాలకు వెళ్లిన ఆ యువకుడు అస్వస్థతకు గురయ్యాడు. నాలుగురోజు ల పాటు దవాఖానలో చికిత్స పొందగా, పరిస్థితి విషమించి మృతిచెందడంతో కొత్తదాంరాజ్‌పల్లిలో విషాదం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. మల్లాపూర్ మండలం కొత్తదాంరాజ్‌పల్లి గ్రామానికి చెందిన బద్దం చంద్రశేఖర్‌రెడ్డి(29) ఈ నెల 17న కొంత మంది స్నేహితులతో కలిసి ఓ వాహనంలో కుంభమేళ, కాశీ, అయోధ్య పుణ్యక్షేత్రాల దర్శనానికి వెళ్లారు. ఈ క్రమంలో కుంభమేళలో పుణ్యస్నానం అనంతరం 20న కాశీకి వెళ్లి దర్శనం చేసుకున్నారు. తిరిగి కాలినడకన వస్తుండగా చంద్రశేఖర్‌రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురై స్పృహ తప్పి కిందపడిపోయాడు. గమనించిన తోటి స్నేహితులు వెంటనే అక్కడ ఉన్న ఓ దవాఖానలో చేర్పించారు. నాలుగు రోజులకు పైగా దవాఖానలో చికిత్స పొందినప్పటికీ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. చంద్రశేఖర్‌రెడ్డి మృతదేహం సోమవారం స్వగ్రామానికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తుల రోదనలు మిన్నంటాయి. దీంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొన్నది.


సారంగపూర్: తుంగూర్‌లో యూరియా కోసం బారులు తీరిన రైతులు


మల్లాపూర్: మండల కేంద్రంలో యూరియా కోసం పోటీపడుతున్న రైతులు

# యూరియా కోసం పడిగాపులు


జగిత్యాల రూరల్: క్యూలో ఆధార్ కార్డు, పాస్‌బుక్‌లు పెట్టి నిల్చున్న రైతులు

- క్యూలైన్లలో ఆధార్, పట్టాదార్ పాస్‌బుక్‌లు, చెప్పులు
- అయినా దొరక్కపోవడంతో నిరాశతో వెనక్కి..
- ఆందోళనలో అన్నదాతలు
- సరిపడా సరఫరా చేయాలని డిమాండ్

జగిత్యాలరూరల్/ సారంగాపూర్/ మల్లాపూర్, ఫిబ్రవరి 24: యూరియా కోసం రైతులు అవస్థలు పడుతున్నారు. సహకార సంఘాల గోదాముల వద్ద పొద్దంతా పడిగాపులు కాస్తున్నారు. ఒక్కొక్కరికి ఒకటి లేదా రెండు మాత్రమే ఇస్తుండడంతో ఎక్కువ అవసరం ఉన్నవారు రోజుల తరబడి తిరుగుతున్నారు. ఒక్కో రోజు అదికూడా దొరకక పోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం వద్ద రైతులు ఆధార్ కార్డు, పాస్ బుక్కులు లైన్లో పెట్టి ఉదయం 8 గంటల నుంచి పడిగాపులు కాశారు. మార్పు కోసం ఓటు అంటే కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల నోట్లో మట్టి కొట్టిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బ్లాక్‌లో బస్తాకు ₹50 అదనంగా విక్రయిస్తున్నారని చెబుతున్నారు. రెండు రోజుల క్రితం మోరపల్లి గ్రామానికి వచ్చిన జీవన్‌రెడ్డిని కలువగా, వ్యవసాయ ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్‌రావుతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చినా, తిరిగి అదే పరిస్థితి వచ్చిందని వాపోయారు. మల్లాపూర్ మండల కేంద్రంలోని సహకార సంఘం వద్ద రైతులు బారులు తీరారు. యూరియా బస్తాల కోసం సంబంధిత పత్రాలను ఇచ్చేందుకు ఎగబడ్డారు. తక్కువ బస్తాలు ఉండడంతో ఒక్కొక్కరికి రెండు చొప్పున అందించారు. గొడవలు తలెత్తకుండా పోలీస్ సిబ్బంది దగ్గరుండి సంచులను పంపిణీ జరిగేలా చేశారు. చాలా మంది రైతులకు అందకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండల సహకార సంఘం పరిధిలోని తంగూర్, మంగెళ గ్రామాల్లో సోమవారం సహకార గోదాం వద్ద రైతులు యూరియా కోసం బారులు తీరారు.

### ఎవుసం చేసుడా.. బంజేసుడా?



ఎవుసం చేసుడా.. బంజేసుడా ? కాంగ్రెస్ సర్కారే చెప్పాలి. రైతులకు కావాల్సిన అన్ని సదుపాయాలు ఇస్తామని చెప్పి ఓట్లు వేయించుకుని ఇప్పుడు ఏమీ ఇస్తలేదు. సన్న వడ్లకు బోనస్, రుణ మాఫీ, రైతు బంధు ఇవేవీ ఇవ్వలేదు. నేను మూడెకరాల్లో ఎవుసం చేస్తున్నా. ఎకరానికి ఒక యూరియా బస్తా సరిపోవడం లేదు. రైతులకు కావాల్సినంత అందించాలె. గతంలో ఆధార్ కార్డుతో యూరియా బ్యాగ్ ఇస్తుండె. ఇప్పుడు, ఆధార్ కార్డు, పాస్‌బుక్కు ఇచ్చినా గంటల తరబడి నిల్చుండబెడుతున్నరు. గత పదేళ్లలో ఇంత గోస ఎప్పుడూ లేదు. రైతులను గోస పెట్టుడు ఈ సర్కారుకు మంచిది కాదు.

*- సిరికొండ వెంకటి,*
*రైతు, లింగంపేట (జగిత్యాల రూరల్)*

## బిల్ కలెక్టర్ల అవినీతిపై విచారణ

కార్పొరేషన్, ఫిబ్రవరి 24: కరీంనగర్ నగరపాలక సంస్థలో నాలుగేళ్ల క్రితం ఆస్తి పన్నులను తమ సొంతానికి వాడుకున్న బిల్ కలెక్టర్ల విషయంపై సీడీఎంఏ ఆదేశాల మేరకు విచారణ కమిటీ అధికారులు సోమవారం నగరపాలక సంస్థలో విచారణ చేపట్టా రు. ఇందులో భాగంగా శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమ న్‌బాబు, జమ్మికుంట కమిషనర్ అయాజ్ నగరపాలక సంస్థలో గతంలో జరిగిన ఆస్తి పన్నుల అక్రమాలపై వివరాలు నమోదు చేసుకున్నారు. కాగా. ఈ విషయంలో గతంలో పలువురు బిల్ కలెక్టర్లను సస్పెండ్ చేయడంతో పాటు సంబంధిత డబ్బులు కూడా ఆయా ఉద్యోగుల నుంచి రికవరీ చేపట్టారు. ఈ ప్రక్రియ కు సంబంధించి వివరాలు సేకరించారు. ఈ మేరకు గతంలో పని చేసిన బిల్ కలెక్టర్ శివ, అధికారి రాములు తదితరులు విచారణకు హాజరై వివరాలను అందించారు.

## జ్యోతిష్మతిలో ఇన్నోఫెస్ట్-2025

తిమ్మాపూర్ రూరల్, ఫిబ్రవరి 24: మండల కేంద్రంలోని జ్యోతిష్మతి కళాశాలలో జ్యోతిష్మతి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ వార్షిక ఇంటర్ కాలేజియేట్ టెక్నికల్ ఈవెంట్స్ 'ఇన్నోఫెస్ట్ 2025' కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.బి.వి. సుబ్రహ్మణ్యం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు సమాజానికి తమ వంతుగా ఉపయోగపడాలన్నారు. విద్యా విషయాలతో పాటు సమాజం విసురుతున్న సవాళ్లకు తమ మేధస్సుతో ఉపయుక్తమైన ప్రయోగాల ద్వారా లబ్ధి చేకూర్చాలని సూచించారు. కళాశాల చైర్మన్ సాగర్ రావు మాట్లాడుతూ, నేడు టెక్నికల్ క్విజ్, కోడ్ ఒ క్విక్ (కోడింగ్), పోస్టర్ ప్రజెంటేషన్, ట్రెజర్ హంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అనిల్ కుమార్, అకాడమిక్ డీన్ పీకే వైశాలి, జిప్స్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ వి. రాజ్ కుమార్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీసీలు రాజ్యాధికారం సాధించుకోవాలి

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 24 : దేశ జనాభాలో 60 శాతం ఉన్న బీసీలు రాజ్యాధికారాన్ని సాధించుకోవాలని సామాజిక వేత్త, ఉద్యమకారుడు తెలంగాణ విఠల్, తెలంగాణ నిరుద్యోగుల జేఏసీ అధ్యక్షుడు డాక్టర్ మహిపాల్‌యాదవ్ పిలుపునిచ్చారు. నగరంలోని ప్రెస్ భవనంలో సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, బీసీలు రాజకీయ, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో వెనుకబడినట్లు తెలిపారు. రాజ్యాధికారంతోనే బీసీల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. బీసీలు ప్రజాప్రతినిధులుగా ఎదగాలన్నారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉన్న బీసీ అభ్యర్థులు ప్రసన్న హరికృష్ణగౌడ్, మల్క కొమురయ్యకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

## బస్సు చార్జీలు తగ్గించాలని వినతి

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 24: హిందూ పండుగల సందర్భంగా ఆర్టీసీ నడిపే ప్రత్యేక బస్సుల్లో అదనపు చార్జీలు తీసుకోవద్దని హిందూ జనజాగృతి సమితి జిల్లా కన్వీనర్ సత్యనారాయణాచారి సోమవారం ఆర్టీసీ ఆర్ఎం చాంబర్‌లో ఆర్ఎం రాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హిందూ పండుగల సందర్భంగా దేవాలయాల సందర్శనకు వెళ్లే వారి నుంచి అదనపు చార్జీలు ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. ఆర్టీసీ అన్ని మతాల వారిని ప్రయాణికులుగానే చూడాలని, కేవలం హిందూ పండుగల రోజుల్లో చార్జీ పెంచడం సరికాదన్నారు. ఆర్టీసీ యాజమాన్యం పెంచిన ధరలను తగ్గించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా హిందూ సంఘాలతో కలిసి ఆందోళన చేపడుతామన్నారు.

## 'ఆ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి'

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 24: నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు చేస్తూ, అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారికి పీడీఎస్‌యూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా విద్య పూర్తిగా వ్యాపారం అయిందని, మోడల్ స్కూల్స్, ఈ టెక్నో, ఫౌండేషన్, డీజీ, మెడిసిన్, ఐఐటీ ఫౌండేషన్, సివిల్స్ లాంటి తోక పేర్లు తగిలించుకొని యథేచ్ఛగా రూ.లక్షల్లో ఫీజులు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అలాంటి పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇక్కడ జిల్లా ఉపాధ్యక్షుడు లోకిని రమేశ్, నాయకులు పల్లవి, వైష్ణవి, వెన్నెల ఉన్నారు.

## హామీలు అమలు చేయాలి

కలెక్టరేట్, ఫిబ్రవరి 24: ఎన్నికలకు ముందు అంగన్‌వాడీ సిబ్బందికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్, టీచర్స్ యూనియన్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈమేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనర్‌కు ఆ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆసంఘం నాయకురాళ్లు మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ విరమణ చేసిన ఆయాలు, టీచర్ల ప్రయోజనాలు ఇప్పటివరకు విడుదల చేయలేదని, పీఆర్సీ కూడా చెల్లించకుండా తాత్సారం చేస్తున్నదని, జిల్లాలో అప్‌గ్రేడ్ చేసిన మినీ అంగన్‌వాడీల్లో విధులు నిర్వహిస్తున్న టీచర్లు, ఆయాలకు పెరిగిన వేతనం విడుదల చేయడం లేదని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల మాదిరి అంగన్‌వాడీలకు కూడా వేసవిలో సెలవులు ప్రకటించాలని, నాణ్యమైన సరుకులు అంగన్‌వాడీలకు సరఫరా చేయాలని కోరారు. అంగన్‌వాడీల్లో ఖాళీగా ఉన్న టీచర్లు, ఆయాల పోస్టులను సత్వరమే భర్తీ చేయాలని, అద్దె భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాల అద్దె సత్వరమే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో స్వరూప, లలిత, రాజమణి, పద్మ, వెంకటలక్ష్మి, వీరమ్మ, తదితరులు పాల్గొన్నారు.